# బావా...బావా! పన్నీరు...

-కోట రాధాకృష్ణ
ఇ.నం.22-11-141
స్వరాజ్ డీలక్స్ ఎదురు
బోస్‌రోడ్,తెనాలి-522 201.

**కర్మసాక్షి - తొలి కిరణాలు దట్టమైన పొగమంచును చీల్చుకుంటూ భూమండలం మీదకి ప్రసారం చేశాడు.**

ఇంటి ముంగిళ్ళలో రకరకాల ముగ్గులను వేసి, వాటి మధ్య ఇంద్రధనుస్సు రంగులు చల్లి, గొబ్బిళ్ళను పెట్టి,రంగుల పూలతో వాటిని అలంకరించి, కోకిలల 'కూ,కూ' ధ్వనుల మధ్య గొబ్బిళ్ళ పాటలు పాడుతూ, పశుసంపదల చిరు మువ్వల శబ్దాలు శృతులు కలుపుతూండగా - లక్ష్మీదేవిని తమ ఇళ్ళకు ఆహ్వానిస్తూ గొబ్బిళ్ళ పాటలు పాడుతున్నారు.. ఆ ఊరి యువతులు కొందరు.

కాలి అందెలు 'ఘల్లు, ఘల్లు' మనిపిస్తూ - రామనామ సంకీర్తనలు - రాగ యుక్తంగా పాడుతూ.. లయబద్ధంగా చిడతలు మ్రోగిస్తూ.. ఇంటింటికీ తిరుగుతున్నాడు హరిదాసు...

ఢమరుకల.. ధ్వనులు చేస్తూ, అంబ పలుకుల తో.. ఆశీర్వదిస్తూ ఊరు వారిని సంతోషపరుస్తూ, వారిచ్చే కానుకలు అందుకుంటూ, తిరుగుతున్నారు... బుడబుక్కల వాళ్ళు..

హైదరాబాదు నుండి వచ్చి, ఆ ఊరి సెంటరులో ఆగింది.. డీలక్స్‌బస్. అందులో నుండి 'ఎయిర్ బ్యాగ్'తో క్రిందికి దిగాడు కార్తీక్, సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చి.. తమ చుట్టూ గుంపుకట్టిన వారికి పేరుపేరున దండాలు పెట్టిస్తున్నారు గంగిరెద్దు మేళం వాళ్ళు.. సెంటర్‌లో ఒక ప్రక్కన..

* * *

వేగంగా నడిచి ఇంటికి చేరుకున్న కార్తీక్.. గుమ్మంలోనే తమ ఇంటిని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయాడు. ఇంటి ముందు నడవా మొత్తం ముగ్గులూ, గొబ్బిళ్ళూ వగైరాలతో అలంకరించబడి ఉంది.

తన తల్లి అలాంటి అలంకరణలూ అవీ గతకొన్ని సంవత్సరాలుగా చేయడం లేదు. తను ఒక్కడే తన తల్లిదండ్రుల ఏకైక సంతానం. తను ఉద్యోగ నిమిత్తం హైదరాబాదులో గత రెండు సంవత్సరాలుగా ఉండటం వలన తమ ఇంటివద్ద ఇలాంటి అలంకరణలు ఆపివేసింది.. తన తల్లి..

మరి ఈరోజు ఎవరు ఇంత సుందరంగా ఈ ముంగిట్లో అలంకరణలు చేసింది అని ఆలోచిస్తూ రెండడుగులు ముందుకి వేసి.

"సంసారిక్కాతే ఇయ్క్కణం!"

నడవా-వెంబడి ఉన్న పూల పందిరి క్రిందనుండి.. మృదు మధురమైన స్త్రీ స్వరం వినిపించి.. ఆగిపోయాడు కార్తీక్. ఒకడుగు ప్రక్కకు వేసి, సన్నజాజి పందిరి వైపు.. తొంగి చూశాడు.

"మైగాడ్... స్టన్నింగ్ బ్యూటీ!" అనుకున్నాడు మనసులో...

జాజి పందిరి క్రింద ముగ్గు డబ్బాతో కూర్చుని, ఆమె - ప్రక్కన- ఉన్న పది సంవత్సరాల పిల్లవాడిని కసురుకుంటూంది. హైదరాబాదులో ఎందరో అందమైన యువతులనుచూశాడు కార్తీక్. తన ఆఫీసులోనే ఎందరో అందమైన యువతుల మధ్యన పనిచేస్తున్నాడు తను. కానీ ఏ యువతి అందం ఇలా తనను నిలబెట్టలేదు..

నిశ్చేష్టుడై నిలబడిపోయి వాళ్ళనే చూస్తున్నాడు కార్తీక్.. అంతలో ఆ యువతి...

"ఇదిటేవా..." అంటూ

చిరునవ్వుతో ఆ కుర్రవాడిని పిలిచింది.

"ఎన్నుకొణ్ణుడి" అంటూ బుంగమూతి పెట్టి కోపంగా అన్నాడు ఆమెతో...

ఆ యువతి మధురంగా చిరునవ్వు నవ్వుతూ అలిగిన ఆ కుర్రవాణ్ణి తన చేతులలోకి తీసుకుని, చెవిలో ఏదో చెప్పి.. చాక్లెట్ ఇచ్చి, బుగ్గమీద ముద్దు పెట్టుకుంది..

ఉషోదయపు కాంతిలో- పొన్నాగ చెట్టుకింద కూర్చుంటే, మంచుకి తడిసిన పొన్నాగపూలు.. చిరుగాలికి రాలి పూలవాన కురుస్తున్నట్లు ఫీలయ్యాడు కార్తీక్. ఆమె నవ్వుకి పరవశించి..

"ఎంత సేపయిందిరా... వచ్చి...?"

తన్మయత్వంలో.. ఉన్న కార్తీక్.. తల్లి కంఠం, కార్తీక్‌న్ను స్పృహలోకి తెచ్చింది.

"ఆ‌... ఇప్పుడేనమ్మా...!" అంటూ ఆనందంతో తల్లిని వాటేసుకోబోయాడు...

"ఆగరా... ఆగు...! నేను మడితో ఉన్నాను. ముందు లోపలికి వెళ్ళి స్నానం చేసిరా..." చిరునవ్వుతో అంది ఆమె.

"వాళ్ళెవరమ్మా?"

ఆ యువతీ, కుర్రాడి వైపు తల తిప్పి సైగ చేస్తూ అడిగాడు...

"వాళ్ళు మీ నాన్నగారి స్నేహితుడు కృష్ణమీనన్ గారి పిల్లలు. ఆయన రైల్వేలో పనిచేస్తారు. కలకత్తా ట్రైనింగ్ కోసం వెళ్తూ- వాళ్ళని ఇక్కడ వదలి వెళ్ళారు." అని ముందుకి నడిచి, నూతివైపు అడుగులేసింది ఆమె.

"ఓహో..." అంటూ బలవంతంగా వాళ్ళ వైపు నుండి చూపులు తిప్పుకుంటూ ఇంట్లోకి నడిచాడు - కార్తీక్...

* * *

తలంటు స్నానం, పూజా - అయ్యాక, తన గదిలో క్రొత్త బట్టలు ధరించి, తల దువ్వు కుంటూండగా, మళ్ళీ కార్తీక్ ముందు ప్రత్యక్షమయింది.. ఆ యువతి.. చేతిలో అరిసెలూ, సున్నుండలూ, కారప్పూసల ప్లేట్లు ఉన్న 'ట్రే'తో.. నుదుటి మీద అడ్డంగా ఉన్న విబూది బొట్టు తప్పితే.. ఆమె అసలు సిసలు నూరు పైసల తెలుగు యువతిలా ఉంది. ఆమెను చూస్తూనే మదనుడు సంధించి.. సూటిగా విడిచిన బాణం ఏదో మనసును కాంతివేగంలో ఢీకొన్నట్లు ఫీలయ్యాడు కార్తీక్.

"నీ పేరేమిటి?" అడిగాడు ఆమెను...

"ఏవిటి...?" మళయాళంలో అడిగిందామె "ఏమిటి" అని.


"ఓ... భాషా సమస్య కదా!"

అంటూ తన ప్రశ్నను ఇంగ్లీషులో అడిగాడు.

ఆమె పేరు సుహాసిని, ఉమెన్స్ కాలేజీలో బి.ఏ.చదివింది. మళయాళం, ఇంగ్లీషు, హిందీ, తమిళం మాత్రం తెలుసు. తెలుగు రాదు...

ఆ కుర్రవాడు ఆమె తమ్ముడనీ.. పది రోజుల తర్వాత తమ తండ్రి తిరిగిరాగానే, కేరళ వెళ్ళిపోతామనీ.. చక్కటి ఉచ్ఛారణ గల- ఇంగ్లీషులో మృదు మధురంగా చెప్పి, అంతలో తన తల్లి పిలవడంతో వెళ్ళిపోయింది.

"పెళ్ళంటూ చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే చేసుకోవాలి!" అని ఆ క్షణమే దృఢంగా నిశ్చయించుకున్నాడు మనసులో...



* * *

భోజనాల దగ్గర సుహాసిని కోసం వెదికాడు. ఆమె కానీ, ఆమె తమ్ముడు కానీ కన్పించలేదు.

అన్యమనస్కంగా గదిలో పచార్లు చేస్తున్న కార్తీక్‌ని- హాల్లో నుండి తల్లి పిలిచింది. కార్తీక్ హాల్లోకి వెళ్ళాడు.

అతని తండ్రి తాంబూలం నములుతూ, ఉయ్యాల బల్ల మీద కూర్చుని ఉన్నాడు. ప్రక్కనే మరో కుర్చీలో- అతని తల్లి కూర్చొని విసనకర్రతో అతనికి విసురుతూంది.

"ఊఁ... మొన్న మీ రేపల్లె మామయ్య వచ్చాడు! ఈ లగ్నసరిలోనే పెళ్ళి చేద్దాం అన్నాడు! నేను నిన్నడిగి కబురుచేస్తానని చెప్పాను!

ఎల్లుండి.. గురువారం పెళ్ళి చూపులకి వెళ్దాం.." అన్నాడాయన.

"ఏరా... నాన్నగారు అడుగుతుంటే... సమాధానం చెప్పవే...?" తల్లి అడిగింది.

"నాకు ఆ పల్లెటూరి సంబంధం ఇష్టం లేదు..." గొణిగాడు కార్తీక్.

"అమ్మాయి బి.ఏ. చదివిందట! కుందనపు బొమ్మట!"మళ్ళీ అతని తల్లే చెప్పింది..

"పోనీ ఎవరినైనా ప్రేమించావా?" అడిగాడు తండ్రి.. తల అడ్డంగా తిప్పాడు కార్తీక్..

"ముందు అమ్మాయిని చూడరా- నచ్చితేనే చేసుకుందువు గానీ.." నచ్చ చెప్పింది తల్లి...

"పోనీ... సుహాసినిని చేసుకుంటావా? చెప్పు... నాన్నా.." భుజమ్మీద చేయివేసి ఆప్యాయంగా అడిగింది అతని తల్లి..

ఆశ్చర్యపోయాడు కార్తీక్... ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

"కానీ.. వాళ్ళు మళయాళీలు కదా!"

సాంప్రదాయానికి ప్రాణం ఇచ్చే తల్లి - అలా అడిగేసరికి సందేహంగా అడిగాడు కార్తీక్.. అయోమయావస్థలో..

"మనవాళ్ళు అయితే ఫర్వాలేదా?" గద్దించి అడిగాడు తండ్రి అవునని తలూపాడు కార్తీక్ అయోమయంగా...

లేచి తన రూమ్‌లోకి వస్తూంటగా విన్పించింది తల్లి గొంతు.

"ఈ కాలం వాళ్ళకి.. వాళ్ళకి ఏమి కావాలో కూడా.. సరిగ్గా తెలియదండీ!" అంటుంది సానుభూతిగా.

"మరే...!" అన్నాడు తండ్రి నిట్టూరుస్తూ.

* * *

"బావా..."

నగ్న నింగిలో చందమామనూ.. ఆ ప్రక్కన అతికాంతివంతంగా.మెరుస్తున్న శుక్రగ్రహాన్నీ.. జాజి పందిరి కింద ఈజీ చైరులో కూర్చుని చూస్తున్న కార్తీక్ ఉలిక్కిపడ్డాడు ఆ పిలుపు విని.

ఎదురుగా సుహాసిని - నవ్వులవాన కురిపిస్తూ - ఒక్క క్షణం అతని గుండె లయతప్పింది!

"ఏంటి, బావా! అలాచూస్తావు? నేను మళయాళీని కాదు. నీ రేపల్లె మామయ్య కూతుర్నే' అంది చిరునవ్వుతో.

"ఆఁ...!" అంటూ నోరుతెరిచాడు కార్తీక్.

చేతిలో ఉన్న లడ్డూ తెరచుకున్న అతని నోటిలో కుక్కి, ఎడం చేతిలోని పుస్తకం అతని ఒళ్ళో విసిరి, కిలకిలా నవ్వుకుంటూ లోపలికి పరుగెత్తింది.

"ముప్పై రోజులలో మళయాళ భాష" పుస్తకం అతణ్ణి వెక్కిరించింది.

ఒళ్ళో.. అంతలో... ఆమె వెనుకే...

"బావా... బావా... పన్నీరు..." అంటూ సుహాసిని తమ్ముడు వెక్కిరిస్తూ పరుగెత్తాడు.*